www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 29 మార్చి 2023

5

అన్నమయ్య



ఒంటిపూట బడులు నిర్వహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

రాజంపేట అర్బన్: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య రీత్యా వెంటనే ఒంటిపూట బడులు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిరేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై చేపట్టిన ఆందోళనలకు ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకొని ఒంటిపూట బడులు నిర్వహించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రతి ఏడాది మార్చి 15 నుండి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారని, రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్నా ఈ ఏడాది ఇప్పటివరకు ఒంటిపూట బడులపై స్పష్టత ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. కొన్ని ప్రయివేటు పాఠశాలలు రేకుల కింద తరగతులు నిర్వహిస్తున్నారని, ఫ్యాన్లు కూడా లేని ఆ తరగతి గదిలో ఎండ తీవ్రతకు విద్యార్థులు అలమటిస్తున్నారని ఆవేదన చెందారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ రెండు పూటలా పాఠశాలలు నిర్వహించడం తగదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒంటిపూట బడులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, యుగంధర్, అఖిల్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



డిటికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

గిరిజనుడైన కంపా భాస్కర్‌కు చెందిన స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఎపి గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల స్థలం కబ్జా చేయమేకాకుండా దాడి చేసిన పెత్తందార్లు అయిన మహేష్‌రెడ్డి, రాజారెడ్డి, రెడ్డప్పరెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల నుండి కంపా భాస్కర్ కుటుంబానికి రక్షణ కల్పించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్ మాట్లాడుతూ కె.వి.పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 536లో 02.5 సెంట్లు ఖాళీ స్థలం జయచంద్రారెడ్డి, నారాయణరెడ్డి వద్ద 1986 సంవత్సరంలో కంపా చిన్నప్ప కొనుగోలు చేశారు. ఆ స్థలంలో బండ్ల మిద్దె నిర్మించుకున్నారన్నారు. కొంత ఖాళీ స్థలం ఉండటంతో పెత్తందార్ల కన్ను ఆస్థలంపై పడిందన్నారు. ఈ ఏడాది జనవరి 10వ తేదీన కె.వి.పల్లి పోలీస్ స్టేషన్‌లో కంపా భాస్కర్ ఫిర్యాదు చేయడంతో మహేష్‌రెడ్డి, రాజారెడ్డి, రెడ్డప్పరెడ్డి పైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కేసు నమోదు చేసిన పోలీసు అధికారులు మూడు నెలలు అవుతున్న నిందితులను అరెస్టు చేసి జైలుకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్ర, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రాజేష్, ఎర్రయ్య, ఈశ్వరమ్మ, రఘు, సులోచన, రమేష్, చంద్ర, కిరణ్, విజయ్, అమర, భాస్కర్, వినోద్, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు. అనంతరం కబ్జాకు గురైన కంపా లక్ష్మమ్మ ఇంటి స్థలం వద్దకు వెళ్లి నాయకులు పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -రాజంపేట అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా డివిజన్‌లోని జగనన్న కాలనీ లేఔట్లలో వచ్చే రెండు వారాల్లోగా ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలని అధికారులను కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజంపేట డివిజన్‌లోని జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో చేపడుతున్న మౌలిక వసతులపై, ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి గిరీష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలని, స్టేజ్ అప్డేషన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, పురోగతి కనిపించకపోతే చర్యలు తప్పవని అధికారులకు స్పష్టం చేసారు. రాజంపేట డివిజన్‌కి సంబంధించి 100 రోజులకు పైగా స్టేజి కన్వర్షన్ కానివి మొత్తం ఎందుకు 4994 ఉన్నాయని, ఒక్క రాజంపేట (అర్బన్)లో స్టేజి కన్వర్షన్ కానివి 2933 ఎందుకు ఉన్నాయని, అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. రాజంపేట డివిజన్ మొత్తానికి పూర్తి అయిన ఇళ్ళు 37 శాతమేనని, దీనికి త్వరగా పెంచాలని అధికారులను ఆదేశించారు. రాయచోటిలోని నారాయణరెడ్డిపల్లిలో గల జగనన్న కాలనీ లేఔట్‌ను ఉదాహరణగా తీసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. పూర్తి కాబడిన పనులకు సంబంధించి బిల్లులను త్వరగా పంపించాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ పనుల పూర్తికి సహకరించాలని ఆదేశించారు. సచివాలయం వారీగా జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో వారం వారం టార్గెట్ ఇవ్వాలని, టార్గెట్‌ను పూర్తి చెయ్యని పక్షంలో కఠినంగా చర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్ కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ, సచివాలయ ఉద్యోగులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇతర శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 8 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా కోయిల్ ఆళ్వార్ నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పును నీటితో శుద్ధి చేశారు. 11.30 గంటల తరువాత స్వామి వారి దర్శనాన్ని భక్తులను అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాహన సేవలు : ఈ నెల 31న ధ్వజారోహణం, శేషవాహనంపై స్వామివారిని అలంకరిస్తారు. ఏప్రిల్ 1న హంసవాహనంపై వేణుగానాలంకారం, 2న సింహవాహనంపై వటపత్రశాయి అలంకారం, 3న హనుమత్సేవ వాహనంపై నవనీత కృష్ణాలంకారం, 5న మోహినీ అలంకాయంలో గరుడ సేవ, 5న గజవాహనంపై శివదనుర్భంగాలంకారం, ఆరోజే కల్యాణం నిర్వహిస్తారు. 6న రథోత్సవం, 7న ఆశ్వవాహనంపై కాళీయమర్దనాలకారం, 8న చక్రస్నానం, ఆశ్వవాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

జిల్లాలోని రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, రాజంపేట, నందలూరు రైల్వేస్టేషన్లలో కోవిడ్ సమయంలో రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఢిల్లీలో మంగళవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గుంతకల్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులకు, రైతులకు, దూర ప్రయాణాలు ప్రయాణించే వారికి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. రైల్వేకోడూరు వాసులకు ఎప్పటినుండో తీరని కోరికగా ఉన్న అండర్ బ్రిడ్జి, ఓబులవారిపల్లి అండర్ బ్రిడ్జ్ నిర్మాణం త్వరగా నిర్మాణాలు చేపట్టి ఆ ప్రాంత వాసులకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. కోవిడ్ పరిస్థితులు చక్కబడిన తర్వాత రైళ్లను నిలుపుదల పునరుద్ధరణ చేయకపోవడంతో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన కేంద్ర మంత్రి త్వరలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

హనుమంత వాహనంపై రామయ్య విహారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిక్షేత్రంలోని శ్రీపట్టాభిరాముడి ఆలయంలో శ్రీరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం సీతాసమేత పట్టాభిరాముడు తన ప్రియభక్తుడైన హనుమంతునిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు స్వామివారిని ముత్యపు పందిరి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ చంద్రుడికి ప్రీతిగా ఈ వాహన సేవను నిర్వహిస్తున్నట్లు, చంద్రగ్రహ దోష పీడితులు ఈ వాహన సేవలో పాల్గొంటే వారికి ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల్ సేవ నయనానందకరంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మీ, ఎఇఒ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి తేజశ్విని ప్రతిభ

మదనపల్లె అర్బన్ : తిరుపతి ఎన్ఆర్ఐ కాలేజి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో పట్టణంలోని విజయభారతి హైస్కూల్ విద్యార్థిని ఆర్.తేజశ్విని ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతిని కైవసం చేసుకొంది. రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని తేజశ్వినిని మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు అభినందించారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ ఫలితాలు సాధించి, చదువు నేర్పిన పాఠశాలకు, జన్మనిచ్చిన తల్లితండ్రులకు మంచి పేరును తీసుకురావాలని విద్యార్థినికి సూచిస్తూ ఆకాంక్షించారు. ఉజ్వల భవిషత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు.

టిబి రహిత జిల్లాగా మారుద్దాం : గిరీష

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లాని టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ గిరీష అన్నారు. మంగళవారం రాజంపేటలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టిడి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ మాట్లాడుతూ టిబి వ్యాధి వస్తే ఇంట్లో వాళ్లు కూడా దూరం పెట్టే పరిస్థితి ఉందని వారిని దగ్గరకు రానివ్వరని, అటువంటి పరిస్థితిని రూపుమాపడానికి ప్రధానమంత్రి 2025 నాటికి టిబి లేని భారతాన్ని నిర్మించడానికి టిబి ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ఇవ్వడం వారిని దత్తత తీసుకోవడం వంటి అనేక కార్యక్రమాలు ఉన్నాయన్నారు. రోటరీ క్లబ్ అన్నమయ్య వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం చాలా అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 750 మంది టిబి వ్యాధిగ్రస్తులకు పైగా దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా అధికారులందరూ కూడా కొంతమంది టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోలు, ప్రజలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులను మిగిలిన వారి లాగానే ట్రీట్ చేయాలని, వారిని దూరం పెట్టవద్దని సూచించారు. ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో టిబి వస్తే మనిషి చనిపోయే పరిస్థితి ఉండేదని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. అనంతరం లబ్ధిదారులందరికీ పౌష్టికాహార కిట్లను అందించారు. కార్యక్రమంలో రాజంపేటకు సంబంధించిన వివిధ ప్రజాప్రతినిధులు, డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, ఆరోగ్య అధికారులు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాసాపేట, మార్కెట్ యార్డులో ఆసరా మూడో విడత సమావేశాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అలుపెరగని పాదయాత్రలో అక్క చెల్లెమ్మలుకు జగనన్న ఇచ్చిన హామీ నేడు మూడు విడతలుగా కార్యరూపం దాల్చిందన్నారు. గత ప్రభుత్వాలు మహిళా సంఘాలను భారీ సమావేశాలకు తరలించుకున్నారే తప్ప వారికి లబ్ది చేకూర్చింది లేదన్నారు. ఎన్నికల నాటికి ఆయా సంఘాలంకు బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేస్తుందన్నారు. రైతుల కోసం ప్రాజెక్టుల నిర్మాణం, అక్క చెల్లెమ్మల కోసం చేయూత, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవెన తదితర ఎన్నో పథకాలును అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ సచివాలయ పరిధిలోని 195 సంఘాలకు గాను వైఎస్ఆర్ ఆసరా కింద జమ అయిన రూ.1.30 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ ఫాయాజ్ బాషా, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్, డిఆర్‌డిఎ ఆన్‌ఛార్జి పీడీ సత్యనారాయణ, కౌన్సిలర్లు సుగవాసి పద్మావతి, రౌనక్, గౌస్ ఖాన్, నవరంగ్ నిస్సార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విజయభాస్కర్, కో - ఆప్షన్ సభ్యులు అయ్యవారు రెడ్డి, మైమున్నీసా, కొత్తిమీర ప్రసాద్, రియాజుర్ రెహమాన్, నవాజ్ క్రిష్, విక్కీ దేవేంద్ర, జావీద్, అమీర్, కొత్తపల్లె ఇంతియాజ్, హజరత్ ఖాదర్ వలీ పాల్గొన్నారు.

పులివెందులలో కాల్పుల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పి అన్బురాజన్
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కాల్పుల్లో మృతి చెందిన దిలీప్‌కుమార్, గాయపడిన మహబూబ్‌బాష

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్సార్ జిల్లా, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో మంగళవారం తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. భరత్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి తన తుపాకీ తీసుకొని ఇద్దరు వ్యక్తులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన చింతకుంట దిలీప్‌కుమార్(24)ను కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. రాగిపాటి మహబూబ్ బాషా అలియాస్ మస్తాన్ పులివెందులలోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్పి అన్బు రాజన్ కథనం మేరకు వివరాలిలా... భరత్ కుమార్ యాదవ్, పులివెందుల పట్టణంలోని గొర్రెల వ్యాపారి దిలీప్‌కుమార్ మధ్య ఆర్థికలావాదేవీలు ఉన్నాయి. వారం రోజులుగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవపడుతుండేవారు. దిలీప్, భరత్‌కుమార్ యాదవ్‌కు అప్పు ఉండటంతో ఆ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పులివెందులలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మధ్యాహ్నం ఇద్దరూ తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. అక్కడి నుంచి హుటాహుటిన తన ఇంట్లోకి వెళ్లిన భరత్‌కుమార్ యాదవ్ తనవద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపాడు. దిలీప్ ఛాతిపై కాల్పులు జరిపాడు. ఆ సమయంలోనే అతడి పక్కనే ఉన్న దిలీప్ స్నేహితుడు మహబూబ్ బాషా అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతడిపైనా కాల్పులు జరిపినట్టు బాధితులు చెబుతున్నారు. గాయాలతో వీరిద్దరూ ఆలయం మెట్ల వద్ద కింద పడిపోవడంతో భరత్‌కుమార్ యాదవ్ అక్కడి నుంచి తుపాకీతో పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బాధితులను చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భరత్ కుమార్ యాదవ్ తుపాకీతో సహా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

వివేకా కేసులో భరత్‌ను విచారించిన సిబిఐ

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో పలుమార్లు సిబిఐ అధికారులు భరత్ కుమార్ యాదవ్‌ను విచారించారు. పలుమార్లు పత్రికా సమావేశం సమావేశాలు నిర్వహించి సిబిఐ అధికారులు, వివేకా కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేశారు. తనకు ప్రాణహాని ఉందని లైసెన్స్ గన్ పొందినట్లు తెలుస్తోంది. వివేకా కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ కుమార్ యాదవ్‌కు భరత్ కుమార్ యాదవ్ స్వయాన సోదరుడు కావడం గమనార్హం.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పి

పట్టణంలో కాల్పుల ఘటన తెలుసుకున్న ఎస్పి అన్బురాజన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును, సంఘటనకు గల కారణాలను పులివెందుల డిఎస్పి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు పిఆర్ డిఎస్పి రమణయ్య రిస్క్ టీం ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి భారీగా పోలీసులు మోహరించారు. పట్టణ సిఐ రాజు, రూరల్ సిఐ మద్దిలేటి, ఎస్ఐలు చిరంజీవి, మల్లికార్జున్‌రెడ్డి కూడా ఎస్పి వెంట ఉన్నారు.



ఘటనపై ఆరా తీస్తున్న ఎస్పి అన్బురాజన్

'మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి'

ప్రజాశక్తి - రాయచోటి

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 'నేషనల్ నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్' జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రారంభంలో అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పి హర్షవర్ధన్ రాజు వివరించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తీసుకోవాల్సిన అంశాలను తెలియజేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా గురించి సమాచార మార్పిడి, జిల్లాలో గసగసాల లేదా గంజాయి పంట అక్రమ సాగుపై పర్యవేక్షణ, క్రాస్-స్టేట్ చిక్కులను కలిగి ఉన్న కేసుల్లో దర్యాప్తు పురోగతిని పర్యవేక్షిస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. మాదకద్రవ్యాలను గుర్తించే పరికరాల ఆవశ్యకతను అంచనా వేయడం, వాటిని కోరుతూ ప్రతిపాదనలను సమర్పిస్తామని తెలిపారు. జిల్లాలో డ్రగ్ డి-అడిక్షన్, పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్‌లో 2021 నుండి 2023 మార్చి వరకు మొత్తం 23 డ్రగ్ కేసులను రిజిస్టర్ చేసి 150.53 కిలోల గంజాయి పట్టుకున్నామని ఎస్‌పి చెప్పారు. 64 మంది నిందితులను గుర్తించామన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని కళాశాలలో పోలీస్ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 81 కళాశాలల్లో 117 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వివిధ కూడలిలో హోర్డింగులు ప్రచార పోస్టర్లు, కరపత్రాలు, పాంప్లెట్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కారాదని ముఖ్యంగా యువత మేలుకోని భవితను మలచుకుని డ్రగ్స్‌ను వదులుకోవాలని సూచించారు. జిల్లాలోని రెవెన్యూ, మార్కెటింగ్, అటవీ, పోలీస్ అన్ని చెక్పోస్టులలో పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపళ్లు, ఎంఈఓలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1908కు ఫోన్ చేసి చెప్పేలా ప్రజలలో అవగాహన కలిగించాలని సూచించారు. వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్డీవోలు మురళి, రంగస్వామి, డిఎస్పిలు సుధాకర్ రెడ్డి, శ్రీధర్, డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, జిల్లా అటవీ అధికారి, డ్రగ్స్ అధికారి, వివిధ శాఖల అధికారులు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు మదనపల్లెకు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు రాక

రాయచోటి: రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ మదనపల్లిలో బుధవారం పర్యటించనున్నట్లు జిల్లా షెడ్యూల్ తెగల సంక్షేమ అధికారి కె.అబ్సలోమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6.00 గంటలకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు మదనపల్లిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి మదనపల్లి మండలం కోటవారిపల్లె తండా చేరుకుంటారు. అక్కడ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తండాలోని గిరిజనులతో ముఖాముఖి చర్చించి అనంతరం మదనపల్లి ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ చేరుకుంటారు. మధ్యాహ్నం ఒక టిన్నర గంటలకు రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలన

రాయచోటి టౌన్ : పట్టణంలోని ఆర్‌టిసి స్టాండ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు .ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న బస్ స్టాండ్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. బైక్ స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఎన్‌హెచ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

నియోజక వర్గ పరిధిలో నిర్వహిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణాలపై ఎన్‌హెచ్ అధికారులతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమీక్షించారు. రాయచోటి-వేంపల్లె రహదారి నిర్మాణాలు, చిన్నమండెంలోని పెండింగ్ పనులు పైన ఆయన చర్చించారు. జాతీయ రహదారుల ఇఇ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, డిఇ సుదర్శన్‌రెడ్డి, ఎఇ రఘునాథ బాబు, ఎఆర్‌కె కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి బాలిరెడ్డి, వినీత్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజారోగ్యం కాపాడడం లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ గంగాప్రసాద్ శానిటేషన్ విభాగ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం దయం 5 గంటలకు పారిశుద్ధ కార్మికుల హాజరు పుస్తకాలను పరిశీలించారు. కార్మిక యూనియన్ నాయకులు, కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణ శివార్లలో శెట్టివాండ్లపల్లె రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డును తనికీ చేశారు. తడి, పొడి చెత్త నిర్వహణ ప్రాజెక్టులు పరిశీలించారు. రోజూ ఎన్ని ట్రిప్పుల వ్యర్థాన్ని ట్రాక్టర్లు, ఆటోల ద్వారా వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఇతర ఇబ్బంది ఉన్నారు.


మహిళలకు చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

మహిళా సాధికారతే లక్ష్యం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిట్వేలు

మహిళ సాధికారత స్వాలంబన లక్ష్యంగా నవరత్నాల్లో ప్రతి పథకాన్ని మహిళలకు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి మహిళ ఆసరాగా ఉండాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని అన్నారు. మండలంలోని 446 స్వయం సహాయక బృందాలకు రూ.3.16 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్ర, సీనియర్ వైసిపి నాయకులు ఎల్‌వి.మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి సుబ్రమణ్యం రెడ్డి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ మోహన్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ పై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపిడిఒ లీలామాధవి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ పరిధిలోను రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి చలివేంద్ర కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని తద్వారా వృద్ధులు, చిన్నపిల్లలు, విద్యార్థులు, ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్నం బయటకు రావద్దని సూచించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లి బస్టాండులో చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్ర కేంద్రాలలో శుద్ధమైన తాగునీరు, మజ్జిగ ను ప్రతిరోజు తాజాగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు చలివేంద్ర కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలం లోని గ్రామ పంచాయతీ సర్పంచ్ జయచంద్ర చల్లివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎండ దృష్టిలో పెట్టుకొని బాటసారుల స్థానికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.


ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న అగా మోహిద్దీన్

ఈద్గాకు బోరు మంజూరు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలోని పాలెం కురవపల్లి సమీపంలో ఈద్గాకు మండల నిధులతో బోరు ప్రారంభించడం జరిగిందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆగామోహిద్దీన్, ముస్లిం మైనార్టీ నాయకుడు వేంపల్లి బావాజీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మైనార్టీ సోదరుల ఆకాంక్ష మేరకు ఈద్గా కోసం తన సొంత నిధులతో భూమిని కొనిచ్చారని అన్నారు. నీటి సౌకర్యం కోసం మండల నిధులతో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈద్గా మైదానంలో మత పెద్దలు సమక్షంలో కేజియన్, హజరత్ అలీ, షఫీ, కరిముల్లా సమక్షంలో ప్రార్థనలు చేసి బోరు బావి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లి ఫయాజ్, వేంపల్లి ఖాదరవల్లి పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి-నందలూరు


విద్యార్థులకు తిథి భోజనాన్ని వడ్డిస్తున్న వైసిపి నాయకులు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయ భాస్కర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని 300 మంది విద్యార్థులకు తిథిభోజనాన్ని అందించారు. జనాబ్ ఎస్‌టి ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వైసిపి నాయకులు నడివీధి సుధాకర్, పల్లె మాధవి, లక్ష్మీదేవి, సిరిసిల్ల నాగేంద్ర, గంగిరెడ్డి, పవన్ కుమార్, స్వామి ఏనుమలై పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన పాలనే రామరాజ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీరాముని ఆదర్శవంతమైన పాలనే రామరాజ్యమని ప్రవచకులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో రాజంపేటలో జరుగుతున్న రామాయణ సప్తాహ కార్యక్రమాలు 6వ రోజుకు చేరుకున్నాయి. మెయిన్ రోడ్డులోగల ఆంజనేయస్వామి దేవస్థానము నందు ఆరవ రోజైన మంగళవారం ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ రామాయణం-రామరాజ్యం అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజ్యపాలనలో ప్రజలందరూ ఎలాంటి కష్టనష్టాలు, కరువు కాటకాలు, ఈతి బాధలు లేకుండా సుఖసంతోషాలతో, శాంతి సౌఖ్యాలతో విలసిల్లే విధంగా శ్రీరాముడు పరిపాలన సాగించాడని ఆయన పేర్కొన్నారు. నీతివంతమైన, ధర్మబద్ధమైన, ఆదర్శ వంతమైన పాలనను అందిస్తూ శ్రీరాముడు ప్రజలమెప్పును పొందాడన్నారు. సరైన సమయానికి వర్షాలు కురుస్తూండగా అన్ని వర్గాల ప్రజలు శ్రీరాముని పాలనలో సంతోషంగా గడిపేవారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వేద పండితులు యతిరాజం హరినాథ శర్మ, ఆలయ అర్చకులు రవికుమార్ స్వామి, ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు, భగవాన్ గీతా సేవాసత్సంగం కార్యాధ్యక్షులు తుంగా వెంకటరమణారెడ్డి, కోశాధికారి నాగా వేణుగోపాల్‌రెడ్డి, రామసుబ్బమ్మ, సిద్ధలింగారెడ్డి, శ్రీవారి భక్తసేవాసమితి అధ్యక్షులు రఘునాథ్, బద్వేలు సుబ్బరాయుడు, జయరామయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చిరుధాన్యాల వలన సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పోషన్ పఖ్వాడాపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తిని ఇచ్చే చిరుధాన్యాలను ఉపయోగిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. రాగులు, సజ్జలు గోధుమలు, వేరుశనగలు లాంటి పిండి పదార్థాలు ఉపయోగిస్తే మంచి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ ఆహారాన్ని తప్పకుండా అందించాలన్నారు. రక్తహీనత ఉన్న పిల్లలకు చిక్కీలు, పాలు గుడ్లు, ఆకుకూరలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు అరుణ్ కుమారి, పద్మజ, తులసమ్మ డిపిఒ లత ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని కో-ఆప్షన్ మెంబర్ ఖలీంభాష, సూపర్వైజర్ నాగమణిలు తెలిపారు. మండలంలోని చెన్నమ్మ శెట్టిపల్లి అంగన్వాడీ కేంద్రంలో రిటైర్డ్ అంగన్వాడీ కార్యకర్త సుజాతకు గ్రామస్తులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం కేక్ కట్ చేసి అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించే అందరి మన్ననలు పొందాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల పౌష్టిక ఆహారం విద్యార్థులకు గర్భిణీలకు, బాలింతలకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను అర్హులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుజాత,రజిని, గ్రామస్తులు చెన్నమ్మ శెట్టిపల్లి వెంకటరమణ,రామాంజులు, అగ్రహారం రామకృష్ణారెడ్డి, తోటరవీంద్ర, నగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.


చిరుధాన్యాలతో అంగన్వాడీ కార్యకర్తలు

రైతు భరోసా కేంద్రాల్లో ఎఒ తనిఖీ


పెద్దమండ్యం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎఒ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మండలంలోని ముసలీకుంట, పెద్దమండ్యం, కలిచెర్ల, సిద్దవరం, బండమీదపల్లి, వెలిగల్లు ఆర్‌బికె కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు పంపిణీ చేసిన రికార్డులను తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించిన నగదు చెలింపులు సకాలంలో చెలించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. అలాగే రైతుమిత్ర గ్రూపుల్లో రాయితీ ట్రాక్టర్లు పెద్దమండ్యం, కలిచెర్ల, కోటకాడపల్లి సచివాలయల పరిధిలో ఈనెల చివరికల్లా సంబంధించిన నమూనా సంబంధించిన అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు సుగుణ, మానస, కీర్తి, యమునా, మల్లికార్జున, సుధాకర్ పాల్గొన్నారు.



బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో విద్యాసంస్థ నిర్వాహకులు

కరాటేలో 'శ్రీభువన' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పీలేరు

హైదరాబాదుకు చెందిన జెకెడి కుంగ్‌ఫూ మార్షల్‌ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ యూత్ అసోసియేషన్ నిర్వహించిన బెల్ట్ టెస్ట్ లో పీలేరు శ్రీభువన విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా చీఫ్ ఎగ్జామినర్ సయ్యద్ ఇస్మాయిల్ ఖాద్రి విద్యార్థులకు కరాటే మాస్టర్ దాము పర్యవేక్షణలో మంగళవారం స్థానిక శ్రీభువన విద్యాలయంలో బెల్ట్ టెస్టు నిర్వహించారు. 34 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్, నలుగురు ఆరెంజ్ బెల్ట్, చరణ్ కుమార్, రెడ్డి దీపక్ ఆచారి అనే విద్యార్థులు బ్రౌన్ బెల్ట్ లు సాధించారు. ఈ సందర్భంగా శ్రీభువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు విజ్ఞానం, ఏకాగ్రతను అలవరచడంతో పాటు వారిలో న్యూనతా భావాన్ని దూరం చేసి, మానసిక స్థైర్యాన్ని నింపి, వారి ఆత్మరక్షణకు ఉపయోగపడే విధంగా మార్షల్‌ఆర్ట్స్ లోనూ శిక్షణ ఇప్పించడం జరుగుతుందని అన్నారు. తమ విద్యాసంస్థలో చదువుకునే విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడే పలు రకాల నైపుణ్యాల్లోనూ శిక్షణ ఇప్పించి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నట్లు చెప్పారు. అనంతరం బెల్ట్ టెస్టులో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, బెల్టులు ప్రధానం చేసి, వారిని అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ దాముతో పాటు విద్యాసంస్థ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సుండుపల్లి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని టిడిపి మండలాధ్యక్షులు, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్ నాయుడులు తెలిపారు. బుధవారం నిర్వహించే టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలిరావాలని కోరారు. **తంబళ్లపల్లి :** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శంకర్‌యాదవ్ ఆదేశాలమేరకు మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గ్రామ కమిటీ నాయకులు, తెలుగుయువత, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మైనార్టీ నాయకులు, సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, మాజీ జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, బూత్ లెవెల్ నాయకులు, అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **కలికిరి:** టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి హనీఫ్ లు పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ నాయకులు మంగళవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి 41 సంవత్సరాలు పూర్తి చేసుకుని 42 వ సంవత్సరంలో అడుగుపెడుతున్న నేపథ్యంలో కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం అత్యంత వైభవంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి వారి ప్రతాప్ కుమార్ రెడ్డి, పులి సత్యనారాయణరెడ్డి, లాయర్ రాంప్రసాద్ రెడ్డి, సహదేవరెడ్డి, వై ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉండాలని టి.కమ్మ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సబిత తెలిపారు. హిందీ ప్రాజెక్టు పనిలో భాగంగా పాఠశాలలో మంగళవారం సుహాన, పవన్ తాజ్, ఆయేషాలు అందమైన బొమ్మలను తయారుచేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ ప్రధానోపాధ్యాయురాలు బబిత మాట్లాడుతూ ఇలాంటి ప్రాజెక్టు పనులు నిర్వర్తించడం వలన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చునని తెలిపారు. హిందీ ఉపాధ్యాయులు సర్తాజ్ హుస్సేన్, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.


ఆకర్షణీయంగా తయారు చేసిన చిత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


నాడు-నేడు పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి

ఆదర్శ నియోజకర్గంగా తీర్చిదిద్దుతాం

-ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రాష్ట్రంలోనే తంబళ్లపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. మంగళవారం మండలంలో మర్రిమాకుల పల్లె, కన్నెమడుగు పంచాయతీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలకు రెండో దశ నాడు-నేడు కార్యక్రమంలో రూ.12 లక్షల అంచనాతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. మర్రిమాకుల పల్లెలో స్వయం సహాయక మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మూడో విడత రూ.7.39 లక్షలు విడుదల అయ్యాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. జడ్‌పి ఉన్నత పాఠశాలకు రెండో దశ నాడు నేడు కింద రూ.1.11 కోట్లు అంచనాతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచులు జ్యోతి, శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మల్లయ్య కొండ చైర్మన్ మల్రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ భార్గవ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డి మల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు రవిశంకర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, రామ్మూర్తి, చంద్రశేఖర్, తాహశీల్దార్ కళావతి, ఎంపిడిఒ ఆనంద్ కుమార్, హౌసింగ్ డిఇ శ్రీహరి పాల్గొన్నారు.

శభాష్ మహమ్మద్ సిరాజ్

కన్నెమడుగు జడ్‌పి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి మహమ్మద్ సిరాజ్ రాష్ట్రస్థాయి సైన్స్ వేర్ లో మ్యాన్ హోల్ క్లీనింగ్ డివైజ్(మ్యాన్ హోల్ శుభ్రం పరిచే పరికరం) ప్రొజెక్టర్ గైడ్ టీచర్లు రమణమ్మ, సిఎల్ఎన్ శాస్త్రి సూచనల మేరకు రూపొందించిన డెమో ఇచ్చారు. ఆ ప్రాజెక్టు జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది. ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి ఆ విద్యార్థిని అభినందించారు.



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

క్రీడా పోటీల్లో సత్తా చాటిన జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లె అర్బన్: ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిపక్ష చూపారని కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఇటీవల చెన్నై లోని అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. అమృతసర్‌లోని గురునానక్ యూనివర్సిటీలో తేక్వాండో పోటీలలో బాబా ఫక్రుద్దీన్ ప్రదీప్ కనపరిచారన్నారు. బిలాస్పూర్ లోని ఎపి వాజ్‌పేయి యూనివర్సిటీలో నిర్వహించిన కరాటే పోటీలలో చానిక్య ప్రసాద్, షేక్ ఫయాజ్ ప్రతిభ చాటారని అన్నారు. సౌత్ జోన్ హాకీ పోటీలలో బెంగళూరు యూనివర్సిటీ నిర్వహించిన హాకీ పోటీలలో బాలురు జట్టు, చెన్నైలోని అంబేద్కర్ యూనివర్సిటీలో హాకీ పోటీలలో బాలికల జట్టు విజయం సాధించారన్నారు. బెంగళూరులోని రెవా యూనివర్సిటీలో నిర్వహించిన చెస్ పోటీలలో రేణుక అద్భుత ప్రతిభ చూపిందన్నారు. మదనపల్లి మండలం ఆరోగ్యవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మినీ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన సోఫియా మెహజబీన్, భాను ప్రకాష్ లు రాష్ట్ర జట్టుకు ఎంపికైనారు. వీరు ముగ్గురు ఆగ్రాలో జరిగే జాతీయస్థాయి మినీ ఫుట్బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు అన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్ నాయక్ అభినందించారు.

స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తులు స్వీకరణ

రాయచోటి టౌన్ : కేంద్ర ప్రాయోజి పథకమైన మిషన్ వాత్సల్య కింద స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు రక్షణ లేదా సంరక్షణ అవసరమైన పిల్లల విద్య, అభివృద్ధి అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రాయోజిక పథకం మిషన్ వాత్సల్య కింద స్పాన్సర్‌షిప్ షరతులతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. స్పాన్సర్‌షిప్ ద్వారా పిల్లలకు నెలకు ఒక్కొక్కరికి రూ. 4 వేలు అందిస్తామన్నారు. అర్హత కల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.


హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రం నందలూరులో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకును ఏర్పాటు చేయడం అభినందనీయమని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నందలూరు ఆర్ఎస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు శాఖను ఆయన పారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నందలూరు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యక్తిగత రుణాలు, వాహన రుణాలు, ఇంటి రుణాలు, ఇంకా అనేక రకాల రుణాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. నందలూరులో ఉన్న అన్ని బ్యాంకులు కన్నా మెరుగైన సేవలు అందించాలన్నారు. హెచ్‌డిఎఫ్‌సి రాయలసీమ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 800 బ్రాంచ్‌లలో సేవలు అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తమ బ్యాంకు సేవలు తీసుకురావాలన్న ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామన్నారు.కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మేనేజర్ కిరణ్ కుమార్, నందలూరు బ్రాంచ్ మేనేజర్ ఆరీఫ్, రాజంపేట బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ స్థానిక నాయకులు గుణ యాదవ్, రమేష్ రెడ్డి, యువరాజు, నడివీధి సుధాకర్, మట్టి బాబు,ఆన్సర్, ఇలియాస్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో డాక్టర్ దినేష్

వైద్య పట్టా అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సునీల్ శశికుమార్ కుమారుడు కె.దినేష్ వైద్యపట్టా అందుకున్నారు. చిత్తూరులోని అపోలో వైద్య కళాశాలలో సోమవారం స్నాతకోత్సవం వేడుకలో 2017-22 బ్యాచ్ కు చెందిన దినేష్ అపోలో వైస్ చైర్మన్ ప్రీతారెడ్డి జ్యోతి చేతుల మీదుగా వైద్య పట్టా అందుకున్నారు. గతంలోనే ఇతని సోదరి కూడా కే.దివ్య కూడా వైద్య పట్టా అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ తాను వైద్య పట్టా అందుకోవడంలో ప్రోత్సహించిన తన తల్లిదండ్రులు, అపోలో వైస్ చైర్మన్ ప్రీతారెడ్డి, వైస్ ఛాన్సలర్ వినోద్‌భట్, డీన్ ఆల్ఫ్రడ్‌అగస్టీన్, అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సుధాకర్‌బాబు లకు కృతజ్ఞతలు తెలిపాడు. తాను చిన్నపిల్లల వైద్య నిపుణుడుగా చేయాలని ఆశయం ఉన్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. వైద్య పట్టా అందుకున్న దినేష్‌ను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా గంగమ్మ జాతర

బి.కొత్తకోట : పట్టణంలోని బిసి కాలనీలో వెలసిన బావిలో గంగమ్మ జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. జాతరకు పుంగనూరు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బి.రామచంద్ర యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ధర్మకర్త చింతల శంకరమూర్తి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకో బోతున్నాయని అన్నారు. దౌర్జన్యం, అరాచక రాజకీయాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవన్నారు. ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏవైనా సమస్యలు వస్తే తనను సంప్రదించవచ్చుని అన్నారు. కార్యక్రమంలో బిసి కాలనీవాసులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీ సేవలు హర్షణీయం

ప్రజాశక్తి-పీలేరు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సేవలు హర్షణీయమని పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఎంపిపి ఆర్‌ఒ.ఉదయ్ తెలిపారు. మంగళవారం వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఎంపీతో పాటు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నిరంతరం పీలేరు ప్రజల అభివృద్ధిని సంక్షేమాన్ని ఆకాంక్షిస్తారని అన్నారు. అందుకోసం పీలేరు పంచాయతీకి వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రయివేట్ బస్టాండ్, జంతువు వధశాలకు నిర్వహించే వేలం పాటల ద్వారా ఏటా రూ.24.73 లక్షలు ఆదాయం వచ్చేదని, రైతులు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే లక్ష్యంగా ఎంపి ఆ నిధులను తానే సమకూరుస్తానని హామీ ఇచ్చారన్నారు. చిరు వ్యాపారులు, రైతులకు గేటు వసూలు బెడద తప్పిందని హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

ప్రజాశక్తి-రామాపురం


ప్రమాదంలో గాయపడిన సూరి

చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి మండలం లోని నల్లగుట్టపల్లి పంచాయతీ లోని బిసి కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కుమారు నికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న టిఎన్ 23 ఎయం 0471 నెంబర్ లారీ ఎదురుగా వస్తున్న ఎపి04 బికె0816 ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో సూరి (26) తనయుడు భరత్ (4)కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సూరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

ఫెన్సింగ్ కూసాలను ధ్వంసం చేసిన వారిపై కేసు

ప్రజాశక్తి-కలికిరి

అక్రమంగా ఫెన్సింగ్ కూసాలను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేస్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మంగమ్మ కాలనీకి చెందిన రెడ్డికుమారి పట్టా భూమిలో రెవెన్యూ వారు సర్వే చేసిన అనంతరము నాటిన కూసాలను, పక్క జాగాలో ఉండే కృష్ణప్ప, కృష్ణకుమారి, అతని కుమారుడు గిరి ప్రసాద్‌లు ఈనె 25నన ధౌర్జన్యముగా ధ్వంసం చేశారని చెప్పారు. స్థల యజమాని రెడ్డికుమారి గానీ, ఆమె కుటుంబ సభ్యులుగాని వస్తే చంపుతామని బెదిరించినట్లు చెప్పారు. సాక్షులు ఫోన్ ద్వారా విషయము తెలుపడంతో మదనపల్లిలో నివాసమున్న రెడ్డికుమారి తన భర్త బాలాజీతో కలికిరికి వచ్చి, తన స్థలంలో ధ్వంసమైన కూసాలను గుర్తించి, కలికిరి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ వివాదంపై ఎస్ఐ సి.లోకేశ్ రెడ్డి ఆదేశాలపై ఎఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.